గణపతి పూజకు వేళాయె...!

- జోరువానలో మార్కెట్లో చవితి సందడి
- పూలు, పండ్లు, పత్రి కొనుగోళ్లు
- జోరుగా వినాయక విగ్రహాల అమ్మకాలు
- మండపాల్లో ఏర్పాటుకు తరలింపు



నర్సీపట్నం : విగ్రహాలను పరిశీలిస్తున్న కొనుగోలుదారులు



నర్సీపట్నం : కొనుగోలు చేసిన విగ్రహాన్ని వ్యాన్ ఎక్కిస్తున్న నిర్వాహకులు



నర్సీపట్నం : పూజకు అవసరమైన పత్రులను కొనుగోలు చేస్తున్న జనాలు



చోడవరం : స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద జనంతో కిటకిటలాడిన మార్కెట్

చోడవరం : వినాయక చవితి సందర్భంగా చోడవరం పట్టణంలో మార్కెట్ సందడితో కిటకిటలాడింది. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపివ్వకుండా వర్షం కురిసినప్పటికీ సాయంత్రం పండ్లు, పూలు, పత్రిలు అమ్మకాలతో సందడి నెలకొంది. మెయిన్‌రోడ్డుతోపాటు ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, సినిమాహాలు జంక్షన్ అన్ని ప్రదేశాలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో కొనుగోలు అమ్మకాలతో నిండిపోయింది. పండ్లు, పూల ధరలు ఆకాశన్నంటాయి. వినాయకుడి మట్టి బొమ్మల అమ్మకాలు జోరుగా సాగాయి. బుధవారం ఉదయమే చవితి గడియలు వస్తుండడంతో ముందుగానే భారీ విద్యుత్ అలంకరణతో సెట్లు వేసిన స్టేజీలను సిద్ధం చేశారు. చోడవరం పట్టణంలో హార్డింజ్ గెస్ట్ హౌస్ ఆవరణంలో మొదటిసారిగా 63 అడుగుల ఎత్తయిన వినాయకుడి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహానికి చవితిరోజున పూజలతో భక్తులకు దర్శన మిచ్చేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

విగ్రహాల ధరలు పైపైకి..

నర్సీపట్నం : తొలి పూజలందుకునే దేవాదిదేవుడు.. విఘ్నాలను పారదోలే గణనాథుడిని కొలిచేందుకు భక్తులు సన్నద్ధమయ్యారు. తొలి పండగ అయిన వినాయక చవితిని ఘనంగా జరుపుకునేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో నర్సీపట్నం మార్కెట్‌కు చవితి శోభ సంతరించుకుంది. పట్టణంలో ప్రధాన జంక్షన్ అబిద్ సెంటర్‌లో విగ్రహాలు, పూజాసామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన జనంతో సందడిగా మారింది. విగ్రహాల ధరలు రూ. వెయ్యి నుంచి రూ. 10 వేలకు పైగా పలికాయి. అయినప్పటికీ పోటీ పడి విగ్రహాలను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన విగ్రహాలను వ్యాన్‌ల్లో ఆయా గ్రామాలకు తరలించారు.

మాడుగుల రూరల్: బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని, మంగళవారం గ్రామాల్లో చలువ పందిళ్ల మండపాలను ఏర్పాటు చేశారు. కె.జె.పురం, ఎం. కోడూరు, కోటపాడు, అగ్రహారం, ముకుందపురం తదితర గ్రామాల్లో చవితి పందిళ్ల ఏర్పాటు చేశారు.

బూత్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలి

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : పార్టీ పటిష్టతకు గ్రామ, మండల కమిటీల నాయకులు సమన్వయంతో పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెట్ల ఉమా శంకర్ గణేష్ పేర్కొన్నారు. నర్సీపట్నం మండల నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల కమిటీ నాయకులు బూత్ కమిటీల నియమాకాలపై ప్రత్యేక దృష్టిసారించి, ఈ నెలాఖరునాటికి జాబితాలను అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అనర్హత పేరుతో అర్హులైన వికలాంగుల పించన్లు తొలగించి వేధించడం అన్యాయమన్నారు. అటు వంటి వారికి మనం అండగా నిలవాలన్నారు. నిజమైన అర్హుల జాబితాను గుర్తించి అధికారులకు నివేదిద్దాం.. న్యాయం చేయకపోతే ఆందోళనల ద్వారా ప్రభుత్వ మెడలు వంచుదామన్నారు. తల్లికి వంద నం కొంత మందికి అందితే..మరి కొంత మందికి అందలేదన్నారు. ఉచిత గ్యాస్ అటెకెక్కించారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కూడా చాలా మంది రైతులకు పడలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అరకొరగా అమలు చేసి ప్రజలతో ఆటలాడుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చేసే వరకు ప్రజల తరపున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో చేపట్టే ప్రత్యక్ష ఆందోళనలకు పార్టీశ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల ఇన్‌ఛార్జి సుర్ల శేఖర్ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను అందజేస్తున్న ఆర్డీవో వి.వి.రమణ



కొత్తకోటలో మట్టి విగ్రహాల పంపిణీ



కె.కోటపాడు : మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు



చమ్మచింతలో మట్టి విగ్రహాల పంపిణీ



రోలుగుంట : భక్తులకు మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న గణేష్



దేవరాపల్లి : మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎంఈవో ఉమ



కొండలఅగ్రహారంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సర్వేశ్వరరావు

నర్సీపట్నం: గ్రీన్‌క్లబ్‌గా ఏర్పడిన పీఆర్‌టీయు ఉపాధ్యాయులు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టితో తయారు చేసిన విగ్రహాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో వి.వి.రమణ విచ్చేశారు. ఆర్డీవో చేతుల మీదుగా మట్టి ప్రతిమలతో పాటు వినాయక వ్రతకల్ప పుస్తకాలను ప్రజలకు అందజేసారు. 3 వేల మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, సభ్యులు రమణ, రమణమూర్తి, రమేష్, అల్లు అప్పారావు, ప్రసాద్, చిన్నారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడులో గల రామాలయం కళ్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను మహిళలకు పంపిణీ చేశారు. విఘ్ననాథుని ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జీవకారుణ్య సంఘం వద్ద దన్వంతరి సహస్రాయ పీఠం సౌజన్యంతో ఆడారి గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. భక్తులు మట్టి విగ్రహాలు వినియోగించి పర్యావరణం కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రావికమతం : పర్యావరణ మేలు కోరుతూ కొత్తకోటలో గుణ ఎంటర్‌ప్రైజెస్ యాజమాని పచ్చిగోళ్ల సంతోష్ ఉచితంగా 500 మట్టి విగ్రహాలను ప్రజలకు మంగళవారం పంపిణీ చేశారు.

నాతవరం: చమ్మచింత గ్రామంలో మంగళవారం నర్సీపట్నానికి చెందిన పసుపులేటి ప్రభాకర్ వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సహకరించిన గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ద్వాక్రా మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవరాపల్లి: మట్టి ప్రతిమలను పూజిద్దాం పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని మండల విద్యాశాఖ అధికారి-1 సిహెచ్. ఉమ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక డ్రాయింగ్ టీచర్ వై.సముద్రం(సాగర్) విద్యార్థులతో మట్టి వినాయక బొమ్మలను తయారీ చేయించారు. ఆయా ప్రతిమలను ఉపాధ్యాయులకు ఎంఈవో చేతుల మీదుగా అందజేశారు.

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణకు అందరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు కోరారు. కొండలఅగ్రహారంలో కన్నూరు నాయుడు సమకూర్చిన మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు.

చీడికాడ: మండల కేంద్రంలో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మదర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మార్తా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ దేముడమ్మ పాల్గొన్నారు.

ఏకధాటిగా వర్షాలు



పొంగి ప్రవహిస్తున్న గొరిగెడ్డ



కె.కోటపాడులో కురుస్తున్న వర్షం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం

కె.కోటపాడు : అల్పపీడన ద్రోణి కారణంగా మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుండి విస్తారంగా వర్షం కురిసింది. వరినాట్లు పూర్తయి 20 రోజులు అవుతున్న పంట పొలాలకు, మెట్ట ప్రాంత గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

రోలుగుంట: మండలంలో సోమవారం రాత్రి నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రోజంతా కురిసిన భారీ వర్షాలకు రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని వీధులు జలమయమయ్యాయి. వర్షాలు ఇలానే కొనసాగితే మరింత నష్టం వాటిల్లుతుందని లోతట్టు ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు.

మాడుగుల : అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పెద్దేరు, గొరిగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట చెరువులతో పాటు చెక్‌డామ్‌లు నిండుగా నీరు చేరడంతో ఖరీఫ్ పంటలకు ఢోకా లేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌స్పైర్‌కు విద్యార్థులను ప్రోత్సహించండి



ఇన్‌స్పైర్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా సైన్స్ అధికారి శ్రీకాళిదాసు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం : గ్రామీణ ప్రాంత విద్యార్థులను జాతీయస్థాయిలో వారి ఆలోచనలను పెంపొందించుకునేందుకు ఇన్‌స్పైర్ మంచి వేదిక అని జిల్లా సైన్స్ అధికారి శ్రీకాళిదాసు పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ నమోదుపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. శిక్షణలో కాళిదాసు మాట్లాడుతూ జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేలు పురస్కారం అందజేస్తారన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి ముగ్గురు, ఉన్నతపాఠశాల ఐదుగురు, హైస్కూల్ స్థాయి ఏడుగురు నమోదు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అనంతరం ఇన్‌స్పైర్ కరపత్రాలను ఆవిష్కరించారు. హెచ్ఎం రత్నం, డీసీసీబీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూపరింటెండెంట్ సుధాశారద



నర్సీపట్నం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎన్.వి.సుధాశారద సూచించారు. ఆమె మాట్లాడుతూ కీటకాల నుంచి వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల రాకుండా ఉండాలంటే దోమలను నిర్మూలించాలన్నారు. దోమలకు అవాసంగా ఉండే నీటి నిల్వలు పరిసర ప్రాంతాల్లో ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు తాగకుండా జాగ్రత్త పడాలన్నారు. చల్లని నీటితో పాటు శీతల పానీయాలు తాగకూడదని, శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు, నిమ్మరసం వంటివి తరచూ తీసుకోవాలని సూచించారు. ఇంటి లోపల, బయట శుభ్రత పాటించాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. జ్వరం తీవ్రంగా ఉంటే తక్షణం సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కొన్ని రోజులుగా వాతావరణ మార్పులతో చాలా మంది వైరల్ జ్వరాల బారిన పడుతున్నారన్నారని, జ్వరాల వల్ల ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులు ఓపీ పెరిగిందన్నారు. వీటిలో ఎక్కువగా జ్వరపీడితులే ఉన్నారన్నారు. ఆసుపత్రికి వచ్చిన సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

జోరుగా వరినాట్లు

మాడుగుల : గత రెండు రోజులు నుండి కురుస్తున్న వర్షాలుకు మెట్ట ప్రాంతంలో రైతులు వరి నాట్లు ఊపందుకున్నాయి. ఇంతవరకు వర్షాలు అనుకూలించక వరి నాట్లు వేయలేని పరిస్థితి. ఈ ఏడాది సక్రమంగా వర్షాలు అనుకూలించక ఖరీఫ్ వరినాట్లు ఆలస్యమైందని రైతులు చెబుతున్నారు. కాగా వర్షాలు రెండు రోజుల నుంచి కురుస్తుండడంతో జంపెన, సత్యవరం, ఎం. కోడూరు, కింతలి గ్రామాల్లో వరి చేలు నీటి ముంపునకు గురవడంతో పంటలు నష్టపోతామని రైతులు దిగులు చెందుతున్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు మెట్ట ప్రాంత రైతులకు మేలు జరుగుతున్నా సరే పల్లపు ప్రాంతాలు వరి మొనలు నీటి ముంపునకు గురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి : గణనాధుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాల నాయుడు ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా, రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో విఘ్నాలు తొలిగిపోయి, విజయాలు సిద్ధించాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మహా గణపతిని కోరుకుంటున్నట్లు తెలిపారు.

వర్షంలో క్వారీ బాధితుల నిరసన

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ బాధితులు ఆర్డీవో కార్యాలయం వద్ద చేస్తున్న నిరాహారదీక్షల్లో భాగంగా మంగళవారం వర్షంలో తడుస్తూ ఆందోళన చేపట్టారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించాలంటూ నినాదాలు చేశారు. ఆందోళనను ఉద్దేశించి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, సీపీఎం నాయకులు చిరంజీవి మాట్లాడుతూ క్వారీ అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళులు



వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద మదర్ థెరిసా విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నేతల నివాళులు



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సన్యాసిపాత్రుడు



తామరంలో థెరిస్సాకు నివాళులర్పిస్తున్న హరిబాబు, తదితరులు

నర్సీపట్నం : మదర్ థెరిసా జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పెదబొడ్డేపల్లి వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, తమరాన శ్రీనువాసరావు, కోనేటి శ్రీనివాసరావు, బుచ్చిరాజు పాల్గొన్నారు. నవ్య లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జన్మదిన వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ స్టేడియంలోని థెరిసా విగ్రహానికి క్లబ్ సీనియర్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి రాంగోపాల్, విజయకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రెజరర్ సుధీర్, గొలుసు శ్రీనివాసరావు, వికాస్ సతీష్, శంకర్‌లాల్, సింగ్, మల్లగణేష్ చిటికెల కన్న పాల్గొన్నారు.

మాకవరపాలెం: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా తామరంలో థెరిస్సా విగ్రహానికి తూర్పు కాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాఠశాల వద్ద ఫ్లెక్సీబోర్డు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం పాఠశాల గేటు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డును ఎట్టకేలకు మంగళవారం తొలగించారు. పాఠశాల వద్ద గేటు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డుకు సంబంధించి సాక్షిలో పచ్చనేతల ప్రచార యావ అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది స్పందించి మంగళవారం ఫ్లెక్సీ బోర్డును అక్కడ నుంచి తొలగించారు.



వీరవల్లి అగ్రహారం పాఠశాల గేటు వద్ద ఫ్లెక్సీ బోర్డు తొలగించిన దృశ్యం